# పునాది

## వి.వి.ఎన్.మూర్తి

"అతనీ రోజు వస్తాడు-"

"ఊఁ!"

"తప్పించుకోటానికి వీలవదా-?"

"ఎలాగో బోధ పడటం లేదు-"

"బ్లంట్‌గా చెప్పేస్తే-"

"ఆ మొద్దు మొహానికి అర్థమవదు-"

"నీ వాటం చూస్తే- అతను రావటం నీకు సరదాయే లాగుంది"




నాకు నువ్వు తప్ప ఎవరూ తెలీదు కదా-"

"-? -? -? -?"

"నీకూ నేను తప్ప- ఎవరు తెలుస్తారులే-"

"! -! -! -!"

"అయామ్ సారీ! ఇవి కేవలం ప్రశ్నలు- జవాబులు లేని ప్రశ్నలు-".

"రవి వెళ్ళి పన్నెండు రోజులయింది-"

"నో నో నో! పారూ.. అయామ్.. అయామ్.."

"రవి మర్చెంట్ నేవీలో పని చేస్తున్నాడు-"

"ప్లీజ్... నా ఉద్దేశ్యం... అదికాదు-"

"ఓడల్లో దేశదేశాలు తిరుగుతున్నాడు-"

"పారూ! పారూ!"

"బ్రహ్మచారి. పది మందిని చూసుంటాడు. ఏదో ఒకటి అంటించుకుని ఉంటాడు.

యస్... యూ మేబీ రైట్...! ఉన్న వారం రోజుల్లో ఎప్పుడో ఒకప్పుడు... ఏదో ఒక వెధవ మనసు... ఏమో! హో సకతా హై!"

"పారూ! పారూ! నన్నెందుకిలా చంపుతున్నావ్! ఇది కేవలం కోయిన్సిడెన్స్!

కాకతాళీయం! ఈ రోజే డాక్టరు దగ్గరకు నేనే వెళ్తాను... సరేనా?" "హో సక్తా హై రాజూ!"

చురుగ్గా చూసింది పార్వతి.

"సారీ పారూ! అయ్ డోంట్ మీన్..."

"ఇట్సాల్ రైట్! నీ మనసులో ఉన్నది నువ్వు చెప్పేసావు- నా మనసులో ఉన్నది నేనూ చెప్పేస్తాను-" "వెల్‌కమ్"

"నాకు కుతూహలం ఉంది. సరదా లేదు".

"అర్థం కాలేదు-"

"ఎలా చూస్తాడూ- ఏం మాట్లాడతాడూ- పశ్చాత్తాపపడతాడా- మన కాపరం చూసి సంతోషం నటిస్తాడా- సంతోషిస్తాడా- ఎలా వ్యవహరిస్తాడూ- జస్ట్ క్యూరియాసిటీ..."

"సరదాకీ దానికీ తేడా ఏంటి?"

"తే... డా..."

"అవును. సరదా.. కుతూహలం..తేడా ఏంటి?"

"సరదా... నువ్వు వాడిన పదం. బహుశా నేను తప్పుగా అనుకున్నానేమో!"

"లేదనుకుంటాను పారూ! ఇద్దరం ఒకరి నొకరిని తప్పుగా అర్థం చేసుకున్నామేమో! ఏమయినా... నన్ను నేను కరెక్ట్ చేసుకుంటాను. నువ్వు... నువ్వు కూడా తప్పు చేసాననిపిస్తే... కరెక్ట్ చేసుకో!"

"రాజూ... రాజూ... ఎవరినయినా నేను యింకెలా ప్రేమించగలను!" పాతిక నిమిషాల మౌనం వాళ్ళిద్దరికీ దుప్పటి కప్పింది.

- 2 -

"మనం చదువుకున్నవాళ్ళం- దీన్ని స్పోర్టివ్‌గా తీసుకోవాలి... డాక్టర్ దగ్గరకు తీసుకెళ్తాను..."

"నన్ను ఆలోచించుకోనీ-"

"ఎన్నాళ్ళాలోచన! పది రోజులవుతోంది. అలా బాధపడిపోతున్నావు. నేను భరించలేకపోతున్నాను"

"సరే- వెళ్దాం-"

"పారూ!"

"చెప్పు"

"నువ్వు అన్యథా భావించకు..."

"... ..." "ఎలా వచ్చిందంటే ఏం చెప్పను-?"

"... ..."

"పారూ! నువ్విలా చూడక! నువ్వు అతనితో పడుకోవాలనుకున్నా... పడుకున్నా... నిజంగానే పడుకున్నా... నేను నిన్ను విడిచిపెట్టను పారూ! విడిచి బ్రతకలేను పారూ! ఆ ఊహే భరించలేను-"

"నువ్వు భరించగలవు- నన్ను విడిచిపెట్టగలవు-?"

"పారూ! వాటీజ్ దిస్-"

"నథింగ్! జస్ట్... ఓ నగ్న సత్యమది..." అతన్నించి గింజుకోటం ఆపింది.

"సారీ- పారూ... ఒక్కమారు అవకాశం యియ్యి- మళ్ళా యిలా జరగదు-" మరింత దగ్గరకు లాక్కోబోయాడు.

"పద! ఇద్దరం టెస్ట్ చేయించుకుందాం-"

"వద్దు! నేను నిన్ను అనుమానించటం లేదు-"

"మరో మాట వద్దు! పద!"

- 3 -

"ఇది వీ.డీ. కాదు-" "మరి-?"

"ఫంగల్ ఇన్ఫెక్షన్- ఓ విధమయిన చర్మవ్యాధి-"

"అర్థంకాలేదు డాక్టర్!"

"చాలా రొటీన్‌గా వచ్చే బాధ! మందులు వాడితే పోతుంది-"

"కలవొచ్చా డాక్టర్!"

"బాధ భరించగలిగితే మీ యిష్టం-నా సలహా... కొన్నాళ్ళు మరిచిపోండి-"

"ఎన్నాళ్ళు సార్!"

"కొద్ది రోజులనే అనుకోండి-"

"థాంక్యూ డాక్టర్-"

- 4 -

"నన్ను క్షమించు పారూ!"

"నిన్నటి సారీకీ యివేళ క్షమార్పణకీ... ఎంత తేడా.. మొహంలో.. గొంతులో.."

"నేను సిగ్గుపడుతున్నాను- నన్ను నేను అసహ్యించుకుంటున్నాను-"

"అక్కర్లేదు రాజూ-మనం మనుషులం- ఓ పద్ధతిలో పెరిగాం... ఒక సమాజంలో పుట్టాం.. ఒక కాలంలో కలిసాం... మనం యిలాంటి అనుమానాలకు లోనవటంలో వ్యక్తులుగా మన బాధ్యత సగమే-" "అయినా..."

**సింగిల్ పేజీ కథ**

"కానీలు... అయినాలు... వ్యర్థం-"

"నేను నమ్మించటానికి ఏం చెయ్యాలి? నిన్ను తిరిగి పొందటానికి ఏంచెయ్యాలి? ఆత్మహత్య చేసుకుంటాను... నమ్ముతావా... నా ప్రాణం..."

"వ్యక్తి వ్యక్తిని నమ్మాలి. తప్పుని రుజువయ్యేవరకూ నమ్మాలి. అదే బంధానికి పునాది కావాలి. ఒప్పుని రుజువయివరకూ నమ్మకపోటం బంధానికున్న పునాదుల్లో చేరిన చెదపురుగు..."

"నీ కాళ్ళు వదలను- నన్నొదిలెయ్యకు-"

"వదలనులే!" "థాంక్యూ... తల్లీ!"

"నువ్వు కాళ్ళు పట్టుకున్నందుకు కాదు..."

"మరి?" "బంధానికి పునాదులు చెదలు పట్టినా... కాపురాలకు బలమైన పునాది నిర్మించారు... మగవాళ్ళు-"

"మగవాళ్ళందరూ వెధవలేనన్న విషయం మర్చిపోకుండా... ప్రతి మగవాడూ అనుక్షణం గుర్తు చేస్తూండటం..." "పారూ!"

"ఈ వెధవను వదిలిస్తే... యింకెంతటి వెధవ దొరుకుతాడోనన్న వైరాగ్యం... విజయవంతంగా... కలిగించదం..."